# మేక్ ఇన్ ఇండియాతో చైనా ఉత్పత్తులకు చెక్

## మోదీ మళ్లీ గెలవాలి : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ సిటీ/నల్లకుంట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంతో చైనా ఉత్పత్తులకు చెక్ పడిందని, ఇప్పుడు ఆ దేశం పాకిస్తాన్‌తో కలిసి మోదీ గెలవకుండా కుట్ర చేస్తోందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో ఆయన పర్యటించారు. అనంతరం సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడారు. మేక్ ఇన్ ఇండియాతో చైనా వెనకబడిపోయిందన్నారు. దీంతో భారతదేశం మీద కక్ష గట్టి లోక్‌సభ ఎన్నికల్లో మోదీని ఓడించాలని కుట్రలు చేస్తోందన్నారు. సీఈ కాలనీలో ఎక్కువ ఓటింగ్ జరగాలని పిలుపునిచ్చారు. ప్రపంచస్థాయిలో భారత్ గౌరవం మరింత పెరగాలంటే మోదీ మళ్లీ గెలిచి ప్రధాని కావాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలో అనేక శక్తులు మోదీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని, వాటిని తిప్పి కొట్టేందుకు ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అమెరికా లాంటి అగ్రదేశాలు కూడా కష్టం వచ్చినప్పుడు నరేంద్రమోదీని సంప్రదిస్తున్నాయన్నారు. ప్రపంచానికి ఒక నాయకుడిగా, దేశానికి ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం భారత్ నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రపంచ దేశాలను శాసించే స్థాయిలో ఉందని, దీన్ని పాక్, చైనా దేశాలు సహించలేకపోతున్నాయన్నారు. 'దేశ అభివృద్ధి, గౌరవాన్ని వ్యతిరేకించే శక్తుల ఓట్లు ఎక్కువ పోలయ్యే అవకాశం ఉందని, దాన్ని దృష్టిలో పెట్టుకొని ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ పోలింగ్‌లో పాల్గొనాలని కోరారు.

కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అడపా చంద్రమౌళి, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, మాజీమంత్రి సి.కృష్ణాయాదవ్, నాయకులు పి. గోవర్ధన్ రెడ్డి, కృష్ణాగౌడ్, శ్యామ్‌రాజ్ ముదిరాజ్, బీజేపీ బాగ్ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు చుక్క జగన్ తదితరులు పాల్గొన్నారు.

### క్రీడాకారులకు అభినందన

**బర్కత్‌పుర, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** క్రీడలకు మోదీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. ఇటీవల జర్మనీలో జరిగిన ఐకేఏ కలినరి ఒలింపిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన చెన్నై అమ్రిత ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్‌కు చెందిన శ్రేయ అనీష్, జగన్, పునీత్, ఆకాష్, అంకిష్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ భూమినాథన్, ప్రిన్సిపాల్ చంద్రమోహన్, సీఈవో కవిత నందకుమార్, రీజనల్ హెడ్ లావణ్య పాల్గొన్నారు.

### లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**బర్కత్‌పుర, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం బర్కత్‌పురలో నగర కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని కార్పొరేటర్లు, కన్వీనర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సికింద్రాబాద్‌లో కమలం జెండా ఎగిరి తీరుతుందని, రాష్ట్రంలో పది ఎంపీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ.. మోదీ మరొకసారి ప్రధాని కావాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. సమావేశంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు అధ్యక్షత వహించగా బీజేపీ నాయకులు మహేందర్, శ్యామ్‌సుందర్ గౌడ్, చంద్రశేఖర్, దీపక్‌రెడ్డి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

## ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాల నివారణ

- నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

**బర్కత్‌పుర, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్‌రాజు అన్నారు. గురువారం నిజాం కళాశాలలో ట్రాఫిక్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వలన ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. సిగ్నల్ జంపింగ్ చేయొద్దని, రాంగ్‌రూట్‌లో వెళితే ప్రమాదాల బారిన పడక తప్పదన్నారు. కార్యక్రమంలో నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. ఉపేందర్‌రెడ్డి, నెహ్రూ యువ కేంద్రం కో-ఆర్డినేటర్ ఆర్. విజయారావు, ఆబిడ్స్ ట్రాఫిక్ సీఐ రవి తదితరులు పాల్గొన్నారు.

## నల్లకుంటలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

**రాంనగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** నల్లకుంట సీఐ జగదీశ్వర్ ఆధ్వర్యంలో జెండా గల్లీ, అడిక్‌మెట్, వడ్డెరబస్తీ, అంజయ్యనగర్ ఏ, బీ, టీఆర్‌టీ క్వార్టర్స్, నర్సింహబస్తీ, శంకరమఠం ప్రాంతాల్లో పోలీసులు గురువారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

ఈస్ట్‌జోన్ డీసీపీ, ఓయూ ఏసీపీ, ముగ్గురు సీఐలు, 9 మంది ఎస్ఐలు, ఇద్దరు ఏఎస్ఐలు ఓయూ పీఎస్‌కు చెందిన 30 మంది, నల్లకుంట పీఎస్‌కు చెందిన 20 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు భయాందోళనకు గురికాకుండా ఎన్నికల్లో పాల్గొనాలనే లక్ష్యంతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

## జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధం

- లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రక్రియ ప్రారంభిస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**కవాడిగూడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** అర్హులైన జర్నలిస్టులందరికీ ఏడాదిలోపు ఇళ్లు లేదా స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై సమీక్షించి ప్రణాళిక తయారు చేస్తామని తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని కోరుతూ గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్టు మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు మామిడి సోమయ్య, బి. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పిల్లి రాంచందర్‌తో కూడిన ప్రతినిధి బృందం మంత్రిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత అన్ని సొసైటీల సమావేశం ఏర్పాటుచేసి రూట్ మ్యాప్ తయారు చేసి సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.



అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో జయశ్రీ

## పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

**కవాడిగూడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీవో జయశ్రీ, సూపర్ వైజర్ ఉమ అన్నారు. గురువారం శ్రీరాంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. పౌష్టికాహారంపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. అందరూ పౌష్టికాహారం తీసుకోవాలని జయశ్రీ సూచించారు. ఈ సందర్భంగా అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



పీఆర్సీ కమిషన్ ఛైర్మన్ శివశంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ శాఖ అధికారుల సంఘం ఛైర్మన్ కృపాకర్‌రెడ్డి తదితరులు

## పే స్కేల్ అమలు చేయాలి

**రాంనగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** వ్యవసాయశాఖ అధికారి బేసిక్ పే స్కేల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పే స్కేల్‌తో సమానంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారుల సంఘం ఛైర్మన్ బి. కృపాకర్‌రెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్ కోరారు. ఈ మేరకు గురువారం పీఆర్సీ కమిషన్ ఛైర్మన్ శివశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖాధికారులకు నూతన పే స్కేల్ అమలు చేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి జి. కృపాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి మానస తదితరులు పాల్గొన్నారు.

### అంబేడ్కర్ అభ్యాసకుల సహాయ కేంద్రం

## కో-ఆర్డినేటర్‌గా రవిప్రసాద్



రవిప్రసాద్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

**రాంనగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** విద్యానగర్‌లో వివేకానంద ప్రభుత్వ కళాశాల అంబేడ్కర్ అభ్యాసకుల సహాయ కేంద్రం - 129 కో-ఆర్డినేటర్‌గా తెలుగు సహాయ ఆచార్యుడు ఎస్. రవిప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. అంబేడ్కర్ సహాయ కేంద్రం సేవలను అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఆయనను అధ్యాపకులు సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ అనిల్‌కుమార్, ఇ. నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం



వెంకటేశం

**కవాడిగూడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి కనిపించకుండా పోయాడు. లోయర్ ట్యాంక్‌బండ్ మారుతీనగర్‌లో నివసిస్తున్న కె. వెంకటేశం(55) మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఈనెల 19వ తేదీ తెల్లవారుజామున ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు గురువారం దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని కులాలకు సముచిత న్యాయం

- మున్నూరు కాపులు హక్కులు సాధించుకోవాలి
- ఎమ్మెల్యే దానం నాగేందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

**రాంనగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని కులాలు, మతాలకు సముచిత న్యాయం జరుగుతుందని, మున్నూరు కాపులు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్ ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న దానం మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో మున్నూరు కాపులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు.

వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తూ ముందుకుసాగుతున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కె. మహేష్, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ ఛైర్మన్ కాసుల బాలరాజు, సంగీత నాటక అకాడమీ ఛైర్మన్ పుంజాల అలేఖ్య, ఓబీసీ ఛైర్మన్ టి. వినయ్, మున్నూరు కాపు డెవలప్‌మెంట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల రవి పటేల్, తెలంగాణ రాష్ట్ర యువత అధ్యక్షుడు బండి సంజీవ్‌పటేల్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్‌వీ మహేందర్‌కుమార్‌పటేల్, గ్రేటర్ మహిళా అధ్యక్షురాలు బండారు లత, గ్రేటర్ హైదరాబాద్ యువజన విభాగం అధ్యక్షుడు దేశెట్టి శివపటేల్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యక్రమాల నిర్వహణకు పదవులు అవసరం లేదు

**చిక్కడపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** కార్యక్రమాల నిర్వహణకు మనస్సు ఉండాలి తప్ప పదవులు అవసరం లేదని రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ శశిశ్రీ అన్నారు. ఉజ్వల సంస్థ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం త్యాగరాయగాన సభలో వివిధ రంగాల ప్రముఖులకు విశిష్ట సేవారత్న పురస్కారాల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న శశిశ్రీ మాట్లాడుతూ.. సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర పెరిగిందన్నారు. కేవలం గతంలో లాగా వంటింటికే పరిమితం కాకుండా సాంకేతిక, వైజ్ఞానిక, రక్షణ రంగాల్లో సైతం పాలుపంచుకుంటున్నారన్నారు. సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ మాట్లాడుతూ.. సమాజంలో మంచి భావాల వ్యాప్తికి సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. పద్మ గోవర్ధన్, పొన్నం అంజలి, సాయిపావని, శివశక్తులు ఆనంద్, శివాని, బోరబండ నందుకు పురస్కారాలు అందజేశారు. జ్యోతిష నిపుణులు శివనరసింహన్‌స్వామి, సామాజికవేత్త వీరభోగవసంత రాయలు, గాయని వీణ, సంస్థ అధ్యక్షురాలు లక్ష్మి పాల్గొన్నారు. సభకు ముందు సాయిపావని తదితరులు సినీగీతాలు ఆలపించారు.

## త్యాగధనుడు అప్పారి వెంకటస్వామి

- ఆయన ఆశయాలను కొనసాగించాలి
- వర్ధంతి సభలో పలువురు వక్తలు

**కవాడిగూడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సమైక్య ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణం కోసం 18 సంవత్సరాల సర్వీసును వదులుకున్న త్యాగధనుడు అప్పారి వెంకటస్వామి అని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే నేటి ఉపాధ్యాయుల కర్తవ్యం అని అన్నారు. గురువారం ఐక్య ఉపాధ్యాయ (యూటీఎఫ్) వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి 23వ వర్ధంతి టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు డి.మస్తాన్‌రావు, సి.కమలకుమారి అప్పారి వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కె.జంగయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చావ రవి, కార్యదర్శి ఎ.సింహాచలం, నాయకులు శ్యామ్‌సుందర్, శారద, బుచ్చిరెడ్డి, నరసింహారెడ్డి, రామకృష్ణ, భాస్కర్ రావు తదితరులు పాల్గొని మాట్లాడారు. నేడు స్వార్థ ప్రయోజనాల కోసం జాతీయ సమైక్యతకు చిచ్చుపెట్టి రాజ్యాంగ లక్ష్యాలను అపహాస్యం చేస్తున్న విచ్ఛిన్నకర శక్తులను ఎదుర్కోవడానికి వెంకటస్వామి స్ఫూర్తితో పనిచేయాలన్నారు.

## అడవులను కాపాడుకుంటేనే పర్యావరణ పరిరక్షణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అటవీ శాఖ అధికారులు

**రవీంద్రభారతి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉంటుందని ప్రిన్సిపాల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సీఈఓ డా. సువర్ణ అన్నారు. అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అడవుల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ యువ క్లౌడ్ ఫొటోగ్రాఫర్ యూనుస్ ఫర్హాన్ తీసిన మేఘాల చిత్రాలతో కూడిన పోస్టర్‌ను గురువారం అటవీశాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా.సువర్ణ మాట్లాడుతూ.. అడవులను కాపాడుకుంటేనే పర్యావరణం రక్షించబడుతుందని అన్నారు. మేఘాల్లోని సందేశాన్ని తన కెమెరాల్లో బంధిస్తున్న యూనుస్ ఫర్హాన్ అడవులను కాపాడేందుకు అవగాహన కల్పించడం అభినందనీయమని అన్నారు. పీసీసీఎఫ్ చీఫ్ వైల్డ్ వార్డన్ ఐఎఫ్ఎస్ మోహన్ పర్గేన్, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. అడవులను కాపాడడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు.

## వేధింపులకు గురయ్యే మహిళలు

### షీటీమ్స్ డీసీపీ ఉషా విశ్వనాథ్

# నిర్భయంగా ఫిర్యాదు చేయండి

**కొత్తపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** వేధింపులకు గురయ్యే మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని రాచకొండ మహిళా రక్షణ విభాగం, షీటీమ్స్ డీసీపీ ఉషా విశ్వనాథ్ సూచించారు. గత నెల 16వ తేదీ నుంచి 29వ తేదీ వరకు అందిన 130 ఫిర్యాదుల ఆధారంగా రాచకొండ పరిధిలో షీటీమ్స్ రంగంలోకి దిగి 121 మంది ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నాయన్నారు. ఎల్‌బీనగర్ సీపీ క్యాంపు కార్యాలయం వద్ద షీటీమ్స్ కార్యాలయంలో గురువారం ఆకతాయిలకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో నిపుణులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏసీపీ వెంకటేశం, అడ్మిన్ ఎస్ఐ రాజు, కౌన్సెలింగ్ నిపుణులు నిందితులతో, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆకతాయిల్లో 64 మంది మేజర్లు, 57 మంది మైనర్లు ఉన్నట్లు తెలిపారు. నిందితులపై 4 క్రిమినల్, 63 పెట్టీ, 55 కౌన్సెలింగ్ కేసులు నమోదయ్యాయని వివరించారు. బాధిత మహిళలకు మేమున్నామన్న భరోసానిస్తున్న షీటీమ్స్‌ను రాచకొండ సీపీ తరుణ్‌జోషి అభినందించారు.

### మెట్రోరైళ్లలో డెకాయ్ ఆపరేషన్స్

రాచకొండ షీటీంలు మెట్రోరైళ్లలో డెకాయ్ ఆపరేషన్ ద్వారా ఏడుగురు ఆకతాయిలను పట్టుకుని, జరిమానా కట్టించారు. యంజాల్‌లో ఉండే గృహిణితో స్నేహంగా ఉంటూ భర్త ఇంట్లో లేని సమయంలో అసభ్యకరంగా ప్రవర్తించాడో వ్యక్తి. అతడి బెదిరింపులు తట్టుకోలేక బాధితురాలు ఇబ్రహీంపట్నం షీటీమ్‌ను ఆశ్రయించింది. షీటీమ్స్ రంగంలోకి దిగి నిందితుడిని ఆదిభట్ల పోలీసులకు అప్పగించగా జైలు శిక్ష పడింది.

### ఈ నంబర్లకు కాల్ చేయండి..

బాధిత మహిళలు 87126 62111 (షీటీమ్ వాట్సాప్) నంబర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. 87126 62598 (భువనగిరి), 87126 62599 (చౌటుప్పల్), 87126 62600 (ఇబ్రహీంపట్నం), 87126 62601 (కుషాయిగుడ) 87126 62602 (ఎల్‌బీనగర్), 87126 62603 (మల్కాజిగిరి), 87126 62604 (వనస్థలిపురం) నంబర్ల ద్వారా షీటీమ్స్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

- టి.ఉషా విశ్వనాథ్, డీసీపీ, రాచకొండ విమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్

### ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు

## కిరణ్ అనారోగ్యంతో మృతి



వి.కిరణ్ (ఫైల్)

**రాంనగర్/జవహర్‌నగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్(ప్రజాపంథా) రాష్ట్ర నాయకుడు, ఐఎఫ్‌టీయూ ఆటో యూనియన్, ఆటో అండ్ మోటార్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ప్రగతిశీల ఆటో యూనియన్ హైదరాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి వి.కిరణ్ అనారోగ్యంతో గురువారం సాయంత్రం 3.30 గంటల సమయంలో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కిరణ్ కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఐఎఫ్‌టీయూ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఆటో యూనియన్ నాయకుడిగా, తెలంగాణ ఉద్యమంలో కూడా ఆయన చురుకైన పాత్ర వహించారు. ఆయన మృతిపట్ల ఐఎఫ్‌టీయూ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఎల్.పద్మ, వి.ప్రవీణ్, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్(ప్రజాపంథా) గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎ.మల్లేష్ సంతాపం ప్రకటించారు. కిరణ్ అంత్యక్రియలు శుక్రవారం జవహర్‌నగర్ సమీపంలోగల అంబేడ్కర్ నగర్ శ్మశానవాటికలో జరుగుతాయని వెల్లడించారు.



పురోహితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

## పురోహితులకు ఆర్థిక సహాయం

**గోల్నాక, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఐదేళ్ల నుంచి పురోహితులకు ప్రతినెలా ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో 11 మంది పురోహితులకు రూ. 5 వేల చొప్పున అందజేశారు. పురోహితులు ఎమ్మెల్యేను ఆశీర్వదించారు.

## చలివేంద్రం ప్రారంభం

**నల్లకుంట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** తిలక్‌నగర్ మెయిన్ రోడ్డులో శివశంకర్ యూత్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో పాదచారుల దాహార్తి తీర్చిడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నీలగిరి దివాకర్‌రావు, శ్రీనివాస్, దిలీప్ జైన్, రాజేష్, గోపాల్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## భూదాన్ యజ్ఞబోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

**బర్కత్‌పుర, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** అన్యాక్రాంతమైన భూదాన్ భూములను రక్షించుకునేందుకు భూదాన్ యజ్ఞబోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ సర్వోదయ మండలి అధ్యక్షుడు ఆర్. శంకర్‌నాయక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం సర్వోదయ మండలి రంగారెడ్డి జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. రంగారెడ్డి జిల్లాలో కోట్ల రూపాయల విలువైన భూదాన్ భూములు అన్యాక్రాంతమయ్యాయని అన్నారు. కార్యక్రమంలో భాస్కర్, మల్లేష్, రమేష్, గోవిందమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ఈటలకు సన్మానం



ఆదర్శ సంస్థ వార్షికోత్సవం సందర్భంగా మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ను సన్మానించారు. గురువారం ఈటల రాజేందర్‌ను సంస్థ ఛైర్మన్ వంగాల బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. దాసి సాంబయ్య, భిక్షపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి

## బాధ్యతలు స్వీకరించిన ఫ్లో, వైఫ్లో చైర్‌పర్సన్లు



బాధ్యతలు చేపట్టిన ఫ్లో, వైఫ్లో చైర్ పర్సన్లు

**హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** ఫిక్కీలేడీస్ ఆర్గనైజేషన్ (ఫ్లో), యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (వైఫ్లో)ల చైర్‌పర్సన్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. నగరంలో ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఫ్లో 23వ చైర్‌పర్సన్‌గా ప్రియా గజ్దార్, 19వ వైఫ్లో చైర్‌పర్సన్‌గా రిధి జైన్ బాధ్యతలను స్వీకరించారు. అనంతరం 'ఫ్యూచర్ ఆఫ్ గ్లోబల్ ఉమెన్ లీడర్స్' అంశంపై జరిగిన సదస్సులో టీసీఎస్ లీడర్‌షిప్ బోర్డ్ మెంబర్ ఫర్హానా హక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్థిక స్వాతంత్ర్యం కోసం మహిళలు పనిచేయాల్సి ఉందన్నారు. ఇబ్బందుల్లో ఉన్న మహిళలకు సహాయం చేయాలని ఉద్బోధించారు.

## పార్ట్‌టైం జాబ్.. ప్రొడక్ట్‌కు లైక్ కొట్టడమే పని..

- వృద్ధుడికి ఆశపెట్టి రూ.19.33 లక్షలు మాయం

**హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** సాధారణంగా 61 ఏళ్లంటే రిటైర్మెంట్ వయసు. ఈ వయసులో కూడా పార్ట్‌టైం ఉద్యోగం చేసి సంపాదించి, కుటుంబానికి అండగా నిలవాలని ఓ వ్యక్తి భావించాడు. వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్, ట్విటర్(ఎక్స్), ఫేస్‌బుక్ రీల్స్‌లో వచ్చే పార్ట్ టైం ఉద్యోగాల ప్రకటనలు చూసి, పార్ట్‌టైం జాబ్ చేసే ఉద్దేశంతో వారిని సంప్రదించాడు. సైబర్ నేరగాళ్లు అతడిని టెలిగ్రామ్ టాస్క్ గ్రూప్ 123లో జాయిన్ చేశారు. ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫామ్స్‌లో ఉన్న ప్రొడక్ట్‌ను లైక్ చేయడం, స్క్రీన్‌షాట్ తీసి పంపితే సైబర్ నేరగాళ్ల ఖాతాలో డబ్బులు జమచేసేవారు. ఎక్కువ మొత్తంలో పెట్టుబడి పెడితే, పెట్టుబడితోపాటు వచ్చిన లాభం కూడా ఇస్తామని నమ్మించడంతో ఆ వ్యక్తి రూ.19.33 లక్షలు వారి ఖాతాలో జమచేశాడు. తర్వాత మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.